## క్లుప్తంగా

### నర్సరీ సందర్శన



సెంట్రల్ జైలు ఎస్పీ రాహుల్‌కు స్వాగతం పలుకుతున్న పోలరాజు

**కడియం:** కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని సెంట్రల్ జైలు ఎస్పీ రాహుల్ సోమవారం సందర్శించారు. నర్సరీ అధినేత, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కలను వివరించారు. ఆయన వెంట డీఎస్పీ రాజ్‌కుమార్, అసోసియేషన్ సభ్యుడు గాద నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### వైద్య శిబిరాలు

**కడియం:** సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోమవారం వేమగిరి తోట, కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వేమగిరిలో 48 మందికి, బుర్రిలంకలో 50 మందికి వైద్య పరీక్షలు జరిపారు. వారిలో జ్వరంతో ఉన్న ఐదుగురిని గుర్తించారు. ప్రభుత్వ వైద్యులు ఎం.మణిజ్యోత్స్న, జి.స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

### బాక్స్ బాయ్స్‌ను తొలగించడం అన్యాయం

**ప్రకాశం నగర్:** రైల్వేలో బాక్స్ బాయ్స్‌గా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని, వెంటనే తొలగించిన కార్మికులకు పని కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. తొలగించిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ రైల్వే లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు.

### హెచ్‌ఎంఎం యూనియన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న హెచ్‌ఎంఎం నాయకులు, కార్మికులు

**ధవళేశ్వరం:** హెచ్‌ఎంఎం యూనియన్ 50వ వార్షికోత్సవాన్ని సోమవారం ధవళేశ్వరం హర్లిక్స్ ఫ్యాక్టరీ వద్ద ఘనంగా నిర్వహించారు. హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ హెచ్‌ఎంఎం, ఐఎన్‌టీయూసీ యూనియన్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జయబాబు ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు కేక్ కట్ చేశారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు కామన సత్యనారాయణ, సలహాదారులు నారపురెడ్డి మురళి పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.జయబాబు, ప్రధాన కార్యదర్శిగా జీవీవీ సత్యనారాయణ, కోశాధికారిగా మట్టా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బెజవాడ శేఖర్, తాతాజీ, అంగర శ్రీధర్ (బుజ్జి), కార్యనిర్వాహక కార్యదర్శిగా యడ్ల వెంకటేష్, సహ కార్యదర్శులుగా కె శివ, సతీష్ ఎన్నికయ్యారు.

### ఆ విరాళంపై ఈడీ దర్యాప్తు చేయాలి

**రాజమహేంద్రవరం సిటీ:** విజయవాడలో బుడమేరు వరద విపత్తులో నష్టపోయిన బాధితులకు పవన్ కల్యాణ్ ఇచ్చారంటూ ప్రచారం జరుగుతున్న కోట్ల రూపాయల విరాళంపై ఈడీ దర్యాప్తు చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని ఆర్పీసీ కార్యాలయంలో మాట్లాడారు. బుడమేరు బాధితుల పేరుతో సేకరిస్తున్న విరాళాలపై చంద్రబాబు ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బాధితులకు సేవలు అందిస్తున్న వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రచార యావతో రాజకీయ విమర్శలు చేసుకుంటోందన్నారు.

### నిత్యావసరాల పంపిణీ

**రాజమహేంద్రవరం సిటీ:** స్థానిక 45వ డివిజన్‌లో ముంపు బారిన పడిన 70 కుటుంబాలకు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. 25 కేజీల బియ్యం, కేజీ ఆయిల్, కిలో చొప్పున కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలను నగర పాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### తాతారావుకు జాతీయ అవార్డు

**రాజానగరం:** మండలంలోని కానవరానికి చెందిన కోడి తాతారావును బెంగళూరులోని సోమలరాజు ఫౌండేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. బెంగళూరులో ఈ నెల 14న జరిగే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో ఆయనకు అవార్డును అందజేస్తారు. మన హక్కులకై పోరాడు – సాధించు ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడిగా తాతారావు సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ఇస్తున్నట్టుగా నిర్వాహకులు తెలిపారు.

# నర్సరీ ఎగుమతులకు ముసురు

- సీజన్ ప్రారంభంలోనే వర్షాలతో అడ్డంకి
- రైతుల ఆశలపై నీళ్లు



కడియం ప్రాంతంలోని నర్సరీలోకి చేరిన వర్షం నీరు

**కడియం:** కడియం ప్రాంత నర్సరీ రైతాంగానికి జూన్ 15 నుంచి ఎగుమతుల సీజన్ ప్రారంభమవుతుంది. ఇక్కడి నుంచి దేశ వ్యాప్తంగా మొక్కలు సరఫరా అవుతాయి. పండ్లు, పువ్వులు, అలంకరణ మొక్కల ఎగుమతులను జోరుగా జరుగుతాయి. జూన్ నుంచి అక్టోబర్ వరకూ సీజన్ కొనసాగుతుంది. ప్రారంభంలో పండ్లు, పూల మొక్కల ఎగుమతులు ఊపందుకుంటాయి. సీజన్ చివరికి వచ్చే సరికి అలంకరణ మొక్కలకు గిరాకీ ఉంటుంది. అయితే ఈ ఏడాది మొక్కల ఎగుమతుల సీజన్ ఆశాజనకంగానే ప్రారంభమైనా, ఆ తర్వాత వర్షాల కారణంగా ఆగిపోయింది.

**దేశ వ్యాప్తంగా ఎగుమతులు**

సీజన్‌లో ప్రతి రోజూ కడియం ప్రాంత నర్సరీల నుంచి దాదాపు 200 నుంచి 300 వరకూ వివిధ వాహనాలపై మొక్కలను దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. సీజన్ మొదలైన సుమారు ఇరవై రోజుల పాటు ఇదే తరహా ఎగుమతులు కొనసాగాయి. ఆ తరువాత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షాల రాక మొదలైంది. కడియం ప్రాంతంలో సైతం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఏకధాటిగా 10 రోజుల పాటు వానలు కొనసాగడంతో ఒక్కసారిగా మొక్కల ఎగుమతులు డీలా పడ్డాయి.

**దెబ్బతీసిన వాతావరణం**

తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు కడియం నర్సరీల నుంచి మొక్కల ఎగుమతి జరుగుతుంది. ఇక్కడ వర్షాలు లేని సమయంలో ఆయా రాష్ట్రాలను వానలు ముంచెత్తాయి. దీంతో మొక్కల కొనుగోలుదారులు తమ ప్రయత్నాలను విరమించుకున్నారు. తీరా అక్కడ వర్షాలు తగ్గుముఖం పట్టాక, ఏపీలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో చేతిలో మొక్కల ఎగుమతుల ఆర్డర్లు ఉన్నప్పటికీ వర్షాల కారణంగా ఎగుమతులకు ఆటంకం కలిగింది.

**చిన్న రైతులే అధికం**

కడియం ప్రాంతంలో నర్సరీల సాగుదారుల్లో 99 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే. ఏకబిగిన కురిసే వర్షాల్లో కూడా మొక్కలను ఎగుమతి చేయగలిగే సామర్థ్యం, మౌలిక సదుపాయాలు వీరికి లేవు. నాలుగైదు రోజులకే వర్షాలు ఆగినప్పటికీ, మరో రెండు, మూడు రోజులు నేల ఆరేవరకూ ఆగాల్సిన పరిస్థితి ఉంటుంది. కడియం మండలంలోని కడియపులంక కేంద్రంగా సుమారు ఇరవై చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నర్సరీలను చేరుకునేందుకు ఉనన దారి మార్గాలు కూడా ఈ వర్షాలకు దిగబడే పరిస్థితులు ఉన్నాయి. దీంతో ఒక రోజు వర్షం కురిస్తే మూడు రోజుల వరకు ఎగుమతులు జరగడం లేదు. దీంతో ఆ మేరకు రవాణా వాహనాలు, ఎగుమతి కూలీలకు పనుల్లేకుండా పోతున్నాయి.

**నిలిచిన ఎగుమతులు**

ఏకబిగిన కురుస్తున్న వర్షంతో మొక్కల లోడింగ్ ఆగిపోయింది. ఒకటి, రెండు రోజుల పాటు వర్షం ఆగినప్పటికీ మొక్కల ఎగుమతికి అవకాశం ఉండదు. దీంతో వర్షం కురిసినన్ని రోజులు మొక్కల లోడింగ్‌కు ఇబ్బందులే.

– జి.వీరబాబు, నర్సరీ కూలీ

**వాతావరణం బాగుంటేనే..**

వాతావరణం అనుకూలిస్తేనే మొక్కల ఎగుమతులు జరుగుతాయి. వర్షంలో మొక్కలు లోడింగ్ చేస్తే, అవి దిగుమతియ్యే సరికి పాడైపోతాయి. దీంతో చిన్నపాటి వర్షానికి కూడా ఎగుమతులను నిలిపివేస్తారు. లేదా తగు జాగ్రత్తలు తీసుకుని మొక్కలు తడవకుండా లోడు పూర్తి చేస్తారు. విడవకుండా కురుస్తున్న వర్షాలకు ఎగుమతులు లేవు.

– కె.కొండయ్య, నర్సరీ కూలీ

## సనాతన ధర్మం శాశ్వతం



సామవేదం షణ్ముఖ శర్మ

**రాజమహేంద్రవరం రూరల్:** సనాతన ధర్మం శాశ్వతమైనదని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. కొంతమూరులోని వల్లభ గణపతి ఆలయ సమీపంలోని ప్రవచన మందిరంలో ఆయన కల్కి అవతార వైభవంపై సోమవారం ఐదో రోజు ప్రసంగాన్ని కొనసాగించారు. సనాతన ధర్మం అన్ని వర్ణాల క్షేమం కోసమేనన్నారు. అంతరిక్షంలోని గ్రహాల శాంతి కోసం కూడా సనాతన ధర్మం ప్రభవించిందని తెలిపారు. శ్రవణ మాత్రం చేత పురాణాలు మనకు శుభఫలితాలను ప్రసాదిస్తాయన్నారు. కల్కి చేసిన శివస్తుతికి ప్రసన్నుడైన పరమేశ్వరుడు అతడికి దివ్యమైన గుర్రాన్ని, సర్వజ్ఞనామం గల చిలుకను, దివ్యమైన ఖడ్గాన్ని ప్రసాదించాడన్నారు. శ్రీరాముడికి కోదండం ఎటువంటిదో, కల్కి దేవునికి ఈ ఖడ్గం అటువంటిదేనన్నారు. కల్కి వేదవిద్యను పరశురాముని వద్ద అభ్యసించాడన్నారు. వేద ధర్మాల రక్షణకే తాను అవతరించానని, వేదవిహిత ధర్మాచరణమే హరికి మనం చేసే సేవ అని కల్కి వివరిస్తాడని సామవేదం అన్నారు. మనం నుదిటి మీద మృత్తిక, (గోపీచందనం), భస్మం, చందనం నిత్యం ధరించాలని, ఈ ధారణ త్రిమూర్త్యాత్మకమైన శక్తికి ప్రతీక అని ఆయన అన్నారు. కాగా.. వల్లభ గణపతి ఆలయంలో జరుగుతున్న నవరాత్ర ఉత్సవాలలో భాగంగా ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామికి లక్ష దూర్వారయుగ్మ పూజ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ



**రాజమహేంద్రవరం రూరల్:** విజయవాడలో వరద కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం చంద్రబాబు కూటమి ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమని మాజీ మంత్రి, నియోజకవర్గం ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వరదలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి 48 గంటలు సమయం ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కనీసం ప్రజలను అప్రమత్తం చేస్తే ఇంతటి నష్టం జరిగేది కాదన్నారు. వరదపై కలెక్టర్లు, ఇంజినీర్లు ముందస్తుగా హెచ్చరించినా చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. దాదాపు రెండు లక్షల మంది ఉన్నారు కాబట్టి వారిని తరలించలేం అన్న ఉద్దేశంతో అలాగే వదిలేశామని రెవెన్యూ కార్యదర్శి సిసోడియా చెప్పడాన్ని బట్టి చూస్తే ప్రజల ప్రాణాలు, ఆస్తులపై ఈ ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోందన్నారు. చంద్రబాబు ఇల్లు, రాధాకృష్ణ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటరీ ద్వారా వరద నీటిని విజయవాడ మీదకు విడిచిపెట్టేశారన్నారు. విపత్తుపై ప్రజలను హెచ్చరించడం, విపత్తు వచ్చిన తరువాత వారికి సక్రమంగా సేవలందించడంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందన్నారు. కేవలం డైవర్షన్ రాజకీయాలతో మాత్రమే నెట్టుకొస్తున్నారన్నారు. చేసేది తక్కువ, పబ్లిసిటీ ఎక్కువ అన్నచందంగా చంద్రబాబు ప్రభుత్వ తీరు ఉందన్నారు. కరోనాను ఎదుర్కొవడానికి కనీసం మౌలిక సదుపాయాలు లేని పరిస్థితుల్లో ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, ఆక్సిజన్ ప్లాంట్లు, మందులు, ల్యాబ్‌లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అటువంటి జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. కరోనాను ఎదుర్కోవడంలో దేశానికే జగన్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. చంద్రబాబు నివాసానికి కూతవేటు దూరంలో వరదలు సంభవిస్తే బాధితులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయి సహాయం అందించలేపోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమన్నారు. చంద్రబాబుకు లాభం వస్తేనే పనిచేస్తారని, లేకపోతే బుడమేరు బాధితులను వదిలేసినట్లు వదిలేస్తారన్నారు. ఇప్పటికైనా వరద బాధితులకు పూర్తిస్థాయిలో సహాయ చర్యలు చేపట్టాలని కోరారు.

# కొనసాగిన ఆక్రమణల తొలగింపు



ఆవ కాలువ వెంబడి ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

**రాజమహేంద్రవరం రూరల్:** హుకుంపేట పంచాయతీ పరిధిలో ఆవకాలువపై ఉన్న ఆక్రమణల తొలగింపు చర్యలు సోమవారం కొనసాగాయి. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఈ నెల ఏడో తేదీన ఆవ కాలువపై ఆక్రమణలను తొలగించిన విషయం తెలిసిందే. రెండు రోజుల సెలవుల అనంతరం సోమవారం తిరిగి కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ జేఎస్ లక్ష్మీరమ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది జేసీబీలతో చర్యలు చేపట్టారు. సిద్ధార్థ కాంపౌండ్‌లోని ప్రహరీని కూల్చివేశారు. ఆ ప్రాంగణంలోని మూడంతస్తుల భవనం, చిల్డ్రన్స్ టాయిలెట్స్‌కు సదరు యజమాని 40 రోజుల సమయం కావాలని లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు విన్నవించుకోవడంతో సమయం ఇచ్చారు. చెరుకూరి గోడౌన్స్‌లోని ఆక్రమణలను సైతం తొలగించగా, ఆ ప్రాంగణంలో ఎక్సైజ్ గోడౌన్‌తో పాటు, ఇతర కంపెనీలు ఉండడంతో టాయిలెట్లు కూల్చకుండా సమయం ఇచ్చారు. బాలాజీపేట దుర్గగుడి వరకూ ఆవకాలువపై ఇళ్ల నిర్మాణం చేపట్టిన సదరు యజమానులకు నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో తెలిపారు. ఇప్పటి వరకు మేజర్‌గా ఉన్న ఆక్రమణలను తొలగించడం జరిగిందన్నారు.

# రైల్వే వెండర్ నిజాయితీ



యజమానులకు పర్సు అప్పగిస్తున్న దృశ్యం

**రాజమహేంద్రవరం సిటీ:** రైల్వే స్టేషన్ ఆహార పదార్థాలను విక్రయించే ఓ వెండర్ తనకు దొరికిన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న పర్సు (పౌచ్)ను దాని యజమానులకు అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన రైల్వే స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆదివారం శేషాద్రి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుండగా గుర్తు తెలియని వ్యక్తి నుంచి జారిపడిన పౌచ్‌ను వెండర్ ఎస్. వెంకటరమణ గమనించాడు. వెంటనే దాన్ని జీఆర్పీ స్టేషన్‌కు అందించాడు. దానిలోని చిరునామా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామానికి చెందిన కె.అనురాధకు చెందినదిగా గుర్తించారు. ఆమె శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో సింగరాయకొండ నుంచి రాజమహేంద్రవరం వరకూ ప్రయాణం చేసి రైల్వేస్టేషన్‌లో దిగి ఇంటికి వెళ్లిపోయారు. దానిలో 12 గ్రాముల నల్లపూసల నెక్ చైన్, రూ.4750 ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జీఆర్పీ స్టేషన్‌కు యజమానులను పిలిపించి వారికి పౌచ్‌ను అందించారు. వెండర్ వెంకట రమణ నిజాయితీని మెచ్చుకుని రూ.4750ను యజమానులు బహుమతిగా అందించారు.

## సినిమాలు



| | |
|---|---|
| శ్యామల | 35 చిన్నకథకాదు |
| సూర్యమినీ | 35 చిన్నకథకాదు |
| సూర్యప్యాలెస్ | సరిపోదా శనివారం |
| స్వామి | సరిపోదా శనివారం |
| అశోక | ఆయ్ |
| శివజ్యోతి | ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్) |
| అనుశ్రీ | ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్) |
| రాజా | ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్) |
| రంభ | మారుతీనగర్ సుబ్రహ్మణ్యం ఉరుకు పటేలా |
| ఊర్వశి | కమిటీ కుర్రోళ్లు |
| మేనక | తంగలాన్ |
| కుమారి | సరిపోదా శనివారం |
| అప్సర నామవరం | సరిపోదా శనివారం |
| వీఎస్ మహల్ ధవళేశ్వరం | ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్) |
| వీఎస్ మహల్ కడియం | ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్) |
| వెంకటసూర్య | ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్) |

# 75 ఎకరాల్లో వరి పంటకు పాక్షిక ముంపు



కోలమూరులో రైతులకు సూచనలు ఇస్తున్న చల్లా నరసింహారావు, చిత్రంలో డీఏవో మాధవరావు

**రాజమహేంద్రవరం రూరల్:** ఇటీవల కురిసిన వర్షాలతో రూరల్, కడియం మండలాల్లో సుమారు 75 ఎకరాల వరి పంట పాక్షికంగా ముంపునకు గురైందని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు మానుకొండ శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్‌తో కలిసి కోలమూరులో ముంపునకు గురైన వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు, స్థానిక జల్ల కాలువ నుంచి నీరు బయటకు పోకపోవడం వల్ల వరి పొలాలు అక్కడక్కడా మునిగాయన్నారు. అయినా నీరు బయటకు పోతున్న నేపథ్యంలో రైతులు ఆందోళన పడొద్దని సూచించారు. ముంపు ప్రాంతాల్లో మాగుడు తెగులు కనిపించిందని. దాని నివారణకు హెక్సాకోనాజోల్ 2.0 మి.లీ లేదా ప్రోపికోనాజోల్ 1.0 మి.లీ లేదా 0.4 గ్రాముల ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబ్యూకోనాజోల్ లేదా అజాక్సీస్ట్రోబిన్ + టెబ్యూకోనజోల్ 1.5 మి లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షపు నీటి నుంచి తేరుకున్న పొలాలలో ఎకరాకు 30 కిలోల పొటాష్, 20 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. స్వర్ణ, ఎంటీయూ 1318 వంటి రకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, వ్యవసాయ అధికారులు ఏ.భీమరాజు, ద్వారకాదేవి ఉన్నారు.

# వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం



గోదావరిలో ఏర్పాటు చేసిన లాంచీ, పంటు



నిమజ్జనానికి తీసుకువచ్చిన గణపతి విగ్రహాలు

**రాజమహేంద్రవరం సిటీ:** గోదావరిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి నగరపాలక సంస్థ పూర్తిస్థాయి చర్యలు చేపట్టింది. వినాయక చవితి ప్రారంభమైన తర్వాత మూడో రోజు సోమవారం నుంచి నిమజ్జనాలు మొదలయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలను భక్తులు తీసుకువస్తున్నారు. నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో గల ఇసుక రేవు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా లాంచీతో పాటు ప్రత్యేక పంటు కూడా సిద్ధం చేశారు. దీనిపై 20 మంది గజఈతగాళ్లను, మూడు షిఫ్టుల్లో సేవలు అందించేందుకు 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. పోలీస్, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. కాగా.. సుమారు 1500 విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టినట్టు నగరపాలకసంస్థ శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు.

# ముంపు బారిన శ్రీరంగపట్నం

**మధురపూడి:** కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం గ్రామాన్ని బురద కాలువ సోమవారం ముంచెత్తింది. గ్రామంలోని బీసీ పేటల్లోని పందుశమ్మ, మోదకొండమ్మ ఆలయం సమీపంలోని ప్రాంతం, ఎస్సీపేటలోని లోతట్టు ప్రాంతాల్లోని నీరు చేరింది. సుమారు 60 ఇళ్ల చుట్టూ వరదనీరు చేరింది. స్పందించిన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ కేఎల్ శివజ్యోతి, తహసీల్దార్ సుస్వాగతం, సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, సెక్రటరీ జానా శ్రీను, స్థానిక నాయకులు సహకార చర్యల్లో పాల్గొన్నారు. సూరంపాలెం జలాశయం నుంచి అదనపు జలాలను కిందికి విడిచిపెట్టడమే ఈ ముంపునకు కారణం. అలాగే రాఘవపురం వద్ద కూడా బురద కాలువ గండి కొట్టింది. ఆ గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శ్రీరంగపట్నంలో ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ ప్రశాంతి బాధితుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు

# శాటిలైట్‌సిటీలో చిరుత సంచారం అబద్ధం

- తేల్చిచెప్పిన అధికారులు
- అసత్య ప్రచారం చేసిన యువకులకు కౌన్సెలింగ్



బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్



అధికారులతో చర్చిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం రూరల్:** శాటిలైట్‌సిటీలోని రాజీవ్ గృహకల్ప సముదాయం 11వ వీధిలో చిరుత సంచరిస్తోందని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం అబద్ధమని అధికారులు తేల్చారు. దీనిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే... చిరుత సంచరించిందనే ప్రచారంపై శాటిలైట్‌సిటీ వాసులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు, పోలీసు అధికారులు అక్కడకు వెళ్లి విచారించగా.. అది అబద్ధమని తేలింది. 11వ వీధిలోని వినాయక మండపం వద్ద నలుగురు యువకులు ఆదివారం రాత్రి అక్కడ ఉన్న ఆటోలో కూర్చున్నారు. సెల్‌ఫోన్‌లో గోడపై ఉన్న చిరుత ఫొటోను డౌన్‌లోడ్ చేసుకుని, శాటిలైట్‌సిటీ సి బ్లాకులో చిరుత సంచారం చేస్తుందని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది వైరల్‌గా మారడంతో జిల్లా ఫారెస్టు అధికారులు, సిబ్బంది, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వోలు అక్కడకు చేరుకుని సదరు యువకులను పిలిచి విచారించారు. అయితే అది సరదాగా పెట్టామని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ యువకులను బొమ్మూరు పోలీస్ స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తీసుకుని వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఇటువంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా.. అటవీ ప్రాంతంలోనే పులి ఉన్నట్టు గుర్తించామని, మరి ఏ ఇతర ప్రాంతాలలో సంచరించడం లేదని ఇన్‌చార్జి జిల్లా ఫారెస్టు అధికారి భరణి తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

**చిరుతను పట్టుకునేందుకు 9 బృందాలు**

**రాజమహేంద్రవరం సిటీ:** చిరుత పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు 50 మంది సిబ్బందితో 9 బృందాలను ఏర్పాటు చేసి, నిరంతరం గస్తీ కాస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆయన సోమవారం నగరంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిరుత సంచారంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిరుత సంచారంపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలందరూ అటవీశాఖ విడుదల చేసిన వీడియోలు చూసి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్లైన్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ ఏ.త్రిమూర్తులు రెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ హెచ్.హేమ శైలజ తదితరులు పాల్గొన్నారు.